
సాక్షి
పల్నాడు
బుధవారం । 18 । జూన్ । 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 513.80 అడుగుల వద్ద ఉంది. ఇది 138.2126 టీఎంసీలకు సమానం.



తెనాలి సుందరీకరణకు చర్యలు

తెనాలి అర్బన్: పట్టణాన్ని తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. మంగళవారం పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.



ఎయిర్‌పోర్టులో స్వాగతం

విమానాశ్రయం: జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మజుందార్‌కు మంగళవారం విమానాశ్రయంలో అధికారులు స్వాగతం పలికారు.

న్యూస్‌రీల్

నేడు ధ్యాన బుద్ధ వద్ద యోగాంధ్ర

నరసరావుపేట: జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన అమరావతి ధ్యాన బుద్ధ విగ్రహం వద్ద బుధవారం ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మంగళవారం వెల్లడించారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించి యోగా ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నామన్నారు.

అరకు కాఫీ అవుట్‌లెట్ ఏర్పాటుకు ప్రోత్సాహం

నరసరావుపేట రూరల్: నేటివ్ అరకు కాఫీ అవుట్ లెట్ ఏర్పాటు కోసం సెర్ప్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నట్లు జిల్లా ఉద్యాన అధికారి ఇ.వెంకట్రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల పథకంలో భాగంగా నేటివ్ అరకు కాఫీ అవుట్ లెట్ నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అవుట్‌లెట్ స్థాపనకు రూ.10లక్షలు అంచనా కాగా 35శాతం రాయితీ అందజేస్తారని వివరించారు. కాఫీ షాపు నిర్మాణం, ప్రాసెసింగ్ పరికరాలు, పాత్రలు, ఉపకరణాల కొనుగోలుకు మాత్రమే రాయితీ అందజేస్తారని తెలిపారు. ఆసక్తి గలవారు జిల్లా, మండల సెర్ప్ సిబ్బందిని లేదా ఫుడ్ ప్రాసెసింగ్ జిల్లా రీసోర్స్ పర్సన్‌లను సంప్రదించాలని సూచించారు.

రెవెన్యూ డే ఘనంగా నిర్వహిస్తాం

గుంటూరు వెస్ట్: ఈ నెల 20వ తేదీన జరగనున్న రెవెన్యూ డేను ఘనంగా నిర్వహిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలి తెలిపారు. 2024లో రెవెన్యూ బోర్డ్ ఏర్పడిన సందర్భాన్ని పురస్కరించుకుని రెవెన్యూ డేను ప్రతి ఏడాది నిర్వహిస్తుంటారని చెప్పారు. రెవెన్యూ శాఖ ప్రజలకు అందించే సేవలను విస్తృత స్థాయిలో ప్రచారం చేస్తామన్నారు. మండల, జిల్లా స్థాయిలో సమావేశాలు ఉంటాయని చెప్పారు.

ఆంక్షల చట్రం

నేడు రెంటపాళ్లలో మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన

ఎన్నికల ఫలితాలు వచ్చీ రాక ముందే.. పచ్చమూకలు పేట్రేగిపోయారు.. ఇక మాకెవరు అడ్డంటూ ఇళ్లపైకి దొమ్మీలకు దిగారు. అడ్డొచ్చిన వారినందరినీ ఆడ,మగ తేడా చూడకుండా దుర్భాషలాడుతూ, ఇళ్లపైకి రాళ్లు రువ్వుతూ వికటాట్టహాసం చేశారు. అప్పటికే బైండోవరై స్టేషన్‌లో ఉన్న బాధితుడిపై అధికార దర్పం చూపుతూ.. బెదిరింపులకు పాల్పడ్డారు. పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు నేడు మాజీ సీఎం వైఎస్ జగన్ రానున్న నేపథ్యంలో పోలీసులను అడ్డుపెట్టుకుని కూటమి పెద్దలు కుట్రలకు దిగారు. చిత్రవిచిత్ర ఆంక్షలతో పర్యటనను అడ్డుకునేందుకు శతధా యత్నించారు.



జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

- పోలీసులు అడిగిన సమాచారం ఇచ్చాం
- కావాలనే ఆంక్షలు విధించి అడ్డుకోవాలని చూస్తున్నారు
- ఆత్మహత్య చేసుకున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త కుటుంబాన్ని వైఎస్ జగన్ పరామర్శిస్తారు
- అడ్డుకోవాలని పోలీసులపై ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి తెస్తోంది
- వైఎస్సార్ సీపీ నేతలు విడదల రజిని, కాసు మహేష్ రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి
- వైఎస్ జగన్ పర్యటనకు భద్రత కల్పించాలని ఎస్పీని కోరిన నేతలు

నరసరావుపేట రూరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు ప్రజల నుంచి వస్తున్న అపూర్వ ఆదరణను చూసి భయంతో కూటమి సర్కారు వణికిపోతోందని మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యేలు కాసు మహేష్ రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి ఇన్‌చార్జి గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డిలు మండిపడ్డారు. పోలీసులు, కూటమి నేతల వేధింపులు తాళలేక గత ఏడాది జూన్ 6న ఆత్మహత్య చేసుకున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త కొర్లకుంట నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు పల్నాడు జిల్లా రెంటపాళ్ల గ్రామానికి రానున్నారు. ఈ నేపథ్యంలో పర్యటనకు సంబంధించి పోలీస్ భద్రత కల్పించాలని నాయకులు మంగళవారం జిల్లా ఎస్పీని కలిశారు. అనంతరం ఎస్పీ కార్యాలయం బయట మీడియాతో మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటనలను అడ్డుకోవాలనే కుట్రతో కూటమి ప్రభుత్వం అనుమతుల పేరుతో పోలీసుల ద్వారా ఆంక్షలు విధిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబ పెద్దను కోల్పోయి, బాధతో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెడుతుండటాన్ని కూడా రాజకీయ కోణంలో చూడటం దారుణమన్నారు.

ఆంక్షలతో జనం ఆకాంక్షలు అడ్డుకోలేరు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి పర్యటన తర్వాత కూటమి ప్రభుత్వంలో ఆందోళన మొదలైందని నేతలు పేర్కొన్నారు. ఆయన ప్రజా సమస్యల పరిష్కారం కోసం బయట కొస్తే ప్రభుత్వం రోజులు లెక్క పెట్టుకోవాల్సి వస్తుందనే భయం కనిపిస్తోందన్నారు. ఆ భయంతోనే పోలీసులు చిత్రవిచిత్రమైన ఆంక్షలు విధించి అడ్డుకోవాలని చూస్తున్నారన్నారు. దేశంలోనే మాస్ లీడర్‌లలో ఒకరైన వైఎస్ జగన్ వస్తుంటే, కేవలం 100 మందినే అనుమతిస్తామని పోలీసులు చెప్పడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. భద్రతా కారణాలను సాకుగా చూపించి ఆయన పర్యటన అడ్డుకోవాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. అయినప్పటికీ చట్టాన్ని గౌరవించే పార్టీగా ఇప్పటికే మూడుసార్లు అనుమతుల కోసం పోలీసులను కలవడం జరిగిందని, మళ్లీ ఈరోజు మరోసారి జిల్లా ఎస్పీని కలవడం జరిగిందన్నారు.

ఆరునూరైనా పర్యటన ఆగదు

వైఎస్ జగన్ పర్యటనకు ప్రత్యేక వాహనాలు కేటాయించి కార్యకర్తలను తరలించబోమని, తాడేపల్లిలో బయల్దేరిన వైఎస్ జగన్ కాన్వాయ్ ఎక్కడా ఆగకుండా నేరుగా నాగమల్లేశ్వరరావు ఇంటికే చేరుకుంటుందని ఎస్పీకి స్పష్టంగా చెప్పామని, అయినా అనుమతిచ్చేది లేనిదీ ఆలోచించి చెబుతామని ఎస్పీ తెలిపారన్నారు. పోలీసులు అనుమతిచ్చినా, ఇవ్వకపోయినా, ఆరునూరైనా వైఎస్ జగన్ పల్నాడు పర్యటన కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎన్ని ఆంక్షలు విధించినా సరే.. వైఎస్ జగన్ రెంటపాళ్ల చేరుకుని నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శిస్తారనడంలో ఎలాంటి సందేహం లేదని వారు స్పష్టం చేశారు.

పోలీసులు బెదిరిస్తున్నారు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటనకు కార్లు, ఆటోలు పంపవద్దని ట్రావెల్స్ నిర్వాహకులకు ఫోన్‌లు చేసి పోలీసులు బెదిరిస్తున్నారు. సామన్య ప్రజలను, వైఎస్సార్ సీపీ క్యాడర్‌ను భయభ్రాంతులకు గురిచేసే విధంగా వ్యవహరించడం దారుణం.

– విడదల రజిని, మాజీ మంత్రి

పరామర్శించి తీరుతాం

మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటనకు అనుమతుల కోసం పలుమార్లు పోలీసులను కలిశాం. ఆంక్షలతో అనుమతులు ఇచ్చేవిధంగా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. వంద మందికే పోలీసులు అనుమతి ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉంది.

– కాసు మహేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, గురజాల

పల్నాడుకు రానివ్వకుండా అడ్డుకునే కుట్ర

జగనన్నను జిల్లాలోకి రానివ్వకుండా అడ్డుకునేందుకు పోలీసులతో చంద్రబాబు, లోకేష్‌లు కుట్రలు చేస్తున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు రాష్ట్రంలో ఎన్ని కార్యక్రమాలు నిర్వహించారో గుర్తుపెట్టుకోవాలి. వైఎస్ జగన్ ఎక్కడకు వెళ్లినా జనం బ్రహ్మరథం పడుతున్నారు. దీన్ని అడ్డుకునేందుకే కుట్రలు పన్నుతున్నారు.

– డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, నరసరావుపేట

అనుమతులు ఇవ్వకపోవడం దుర్మార్గం

రెడ్‌బుక్ పాలనకు బలైన మొదటి వ్యక్తి నాగమల్లేశ్వరరావు. ఎన్నికల ఫలితాల అనంతరం నాగమల్లేశ్వరరావును పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి చిత్రహింసలు పెట్టారు. గ్రామం విడిచి వెళ్లొద్దంటూ పోలీసులు భయభ్రాంతులకు గురిచేశారు. మనస్థాపానికి గురైన నాగమల్లేశ్వరరావు ఆత్మహత్య చేసుకున్నాడు. బాధితుడి కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ సీఎం వస్తుంటే అడ్డుకోవడం దుర్మార్గం.

– డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి ఇన్‌చార్జి

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో నియామకాలు



నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాకు చెందిన నలుగురు నాయకులను పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీల్లో వివిధ హోదాల్లో నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పెదకూరపాడుకు చెందిన రావెళ్ల శ్రీధర్‌బాబు రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగాను, భూక్యా కృష్ణనాయక్ స్టేట్ ఎస్టీ సెల్ సంయుక్త కార్యదర్శిగాను, పోతురాజు శ్రీనివాసరావు స్టేట్ కల్చరల్ వింగ్ సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. అలాగే నరసరావుపేటకు చెందిన జొన్నలగడ్డ హెల్డా ఫ్లోరెన్స్‌ను రాష్ట్ర అంగన్‌వాడీ వింగ్ ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శివకుమారి
- డీఎంహెచ్‌ఓకు సమ్మె నోటీసు అందజేత

నరసరావుపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్స్ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు వచ్చే నెల 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆశావర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శివకుమారి పిలుపునిచ్చారు. ఈ మేరకు సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్లు పాల్గొననున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవికి సోమవారం వినతిపత్రం అందజేశారు. శివకుమారి మాట్లాడుతూ 20ఏళ్లుగా పేద ప్రజలకు ఆరోగ్యసేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా మార్పుచేయాలని, ఒప్పంద జీఓలు విడుదల చేసి నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలన్నారు. చట్టబద్ధమైన సౌకర్యాలు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణ, అనారోగ్యంతో మృతిచెందిన ఆశా కార్యకర్తలకు రూ.10లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఏజెన్సీలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా వర్కర్లుగా మార్పు చేయాలన్నారు.

రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచిన బాబు

- మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- జగన్ అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న బొల్లా బ్రహ్మనాయుడు, నాయకులు

వినుకొండ: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఐదుకోట్లమంది ఆంధ్రులను వెన్నుపోటు పొడవటం తప్ప చేసిందేమీ లేదని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పీఏసీ సభ్యులు, వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. వినుకొండలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని జగన్ అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం బొల్లా మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌లు ఎన్నికలముందు ఇచ్చిన హామీలు మరచి పోయారని ఒక్క రెడ్‌బుక్ అమలు తప్ప, ఎన్నికల వాగ్దానాల అమలు లేదన్నారు. ఎన్నికలముందు ఇచ్చిన హామీలల్లో ఏఒక్కటీ పూర్తిగా అమలు చేయలేదన్నారు. ఉన్న పింఛన్లు తీసివేయడం, అమ్మఒడి పథకంలో ఉన్న పేర్లను తొలగించడం వంటి పనులు తప్ప చంద్రబాబు సర్కారు ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నాయకులు ఇసుక, మట్టి, రేషన్ బియ్యాన్ని ఏరియాలవారీగా పంచుకుని ప్రతి పనికి ఒక రేటు ఖరారు చేసి వసూలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం పేరిట టీడీపీ నేతలు చెలరేగుతున్నారని, వినుకొండలో రషీద్‌తో పాటు, టీడీపీ నాయకుల చేతిలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని, హత్యా రాజకీయాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు రైతుభరోసా ఇవ్వకుండా చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని, పంటలకు గిట్టుబాటు ధర లేక ఎంతో మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రెంటపాళ్లలో జరిగే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటనను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వైఎస్ జగన్ పర్యటన విజయవంతం చేద్దాం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



వెన్నుపోటు పుస్తకం ఆవిష్కరిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

నరసరావుపేట: సత్తెనపల్లి నియోజకవర్గంలోని రెంటపాళ్ళ గ్రామంలో వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు నియోజవర్గం నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. తొలుత కూటమి ప్రభుత్వ ఏడాది పాలన కాలంలోని వైఫల్యాలపై పార్టీ ముద్రించిన 'జగనన్న అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం' పుస్తకం ఆవిష్కరించారు. ఈసందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ఏడాది కాలంలో జరిగిన ప్రభుత్వ వైఫల్యాలను, చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు తెలియజేయాలని కార్యకర్తలకు సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, నరసరావుపేట, రొంపిచర్ల మండల కన్వీనర్లు తన్నీరు శ్రీనివాసరావు, కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ ఇంటలెక్చ్యువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఈయం స్వామి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అన్నెంపున్నారెడ్డి, సామాజిక విశ్లేషకులు ఈదర గోపీచంద్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సుజాతాపాల్, నియోజకవర్గ మహిళా విభాగ అధ్యక్షురాలు బొబ్బిలి శ్రీలక్ష్మి, నాయకులు షేక్ ఖాజావలి మాష్టారు, జి.అచ్యుతరావు, షేక్ కరిముల్లా, మాగులూరి రమణారెడ్డి, అచ్చి శివకోటి, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

జిల్లాలో 9.8 మి.మీ వర్షం

నరసరావుపేట: జిల్లాలో గడిచిన 24గంటల వ్యవధిలో మూడు మండలాల్లో 9.8 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు వాతావరణ అధికారులు మంగళవారం వెల్లడించారు. ఈ మేరకు గురజాలలో 1.0 మి.మీ, అచ్చంపేటలో 6.2, అమరావతిలో 2.6 మి.మీ వర్షం పడింది. కాగా, జిల్లా వ్యాప్తంగా 1242.0 మి.మీ వర్షం పడాల్సివుండగా ఇప్పటివరకు 17రోజుల వ్యవధిలో 535.2 మి.మీ వర్షం మాత్రమే కురిసింది.

రహదారి పునర్నిర్మాణ పనులు ప్రారంభం

మంత్రి నాదెండ్ల మనోహర్



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి మనోహర్

తెనాలి అర్బన్: తెనాలి – గుంటూరు రహదారి పునర్నిర్మాణ పనులను మంగళవారం చెంచుపేటలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తెనాలి నియోజకవర్గంలో రూ.4.30 కోట్లతో 9 కిలోమీటర్ల మేర రోడ్లపై గుంతలు పూడ్చామన్నారు. తెనాలి – గుంటూరు రహదారి పునర్నిర్మాణం కోసం రూ.3.50 కోట్లు, గుంటూరు – హనుమాన్‌పాలెం రోడ్డు నిర్మాణం కోసం రూ.7 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఖాజీపేట వరకు పూర్తయిందని, మిగిలిన పనులు జూలై నెలాఖరులోపు పూర్తి చేసేలా చూడాలని ఆదేశించామన్నారు. రూ.800 కోట్లతో తెనాలి నుంచి మంగళగిరి, తెనాలి నుంచి గుంటూరుకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి అనుమతులు వచ్చాయని చెప్పారు. ఈ ఏడాదిలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా తెనాలిని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఈఈ సి.విశ్వనాథ్‌రెడ్డి, డీఈ డి.రాజేంద్రనాయుడు, ఏఈ బి.శివ నరసింహారావు, కౌన్సిలర్లు గోగిరెడ్డి మాసనరెడ్డి, కొమరబత్తుని జయపాల్, అధికారులు, పలువురు జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ఫిరంగిపురం: గుంటూరు నుంచి నరసరావుపేట వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో దానిపై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు మృతి చెందారు. మరొకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని మేరికపూడి వద్ద సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గుంటూరు నుంచి నరసరావుపేటకు ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. మండంలోని మేరికపూడి సమీపంలో గుర్తుతెలియని వాహనం వారిని ఢీకొంది. ఒకరు అక్కడికక్కడే చనిపోయారు. మృతుడిని కృష్ణా జిల్లా కోడూరు మండలం నారేపాలెంకు చెందిన డి.సుదర్శన్ (20)గా గుర్తించారు. గాయపడిన కృష్ణా జిల్లా మాచవరానికి చెందిన బి.దుర్గాప్రసాద్ (25), బి.క్రాంతి(20)లను 108 వాహనంలో నరసరావుపేటకు చికిత్స కోసం తరలించారు. చికిత్స పొందుతూ దుర్గాప్రసాద్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సురేష్ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాలు సీజ్ చేస్తామనడం తగదు

మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి



పిడుగురాళ్ల: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రెంటపాళ్ల గ్రామంలో పర్యటించనున్న నేపథ్యంలో ఆ కార్యక్రమానికి వాహనాలు పంపితే, వాహనదారులపై కేసులు నమోదు చేస్తామని, వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించడం తగదని, ఇది కొత్త సంప్రదాయానికి దారి తీస్తుందని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పిడుగురాళ్లలో ఆయన మాట్లాడుతూ రాజుపాలెం మండలం రెంటపాళ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త నాగమల్లేశ్వరరావును పోలీసులు అక్రమ కేసులు బనాయించి, బాగా హింసించి, దూషించి ఆత్మహత్యకు పురిగొల్పారన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటనకు అడుగడుగునా పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఎవరెన్ని ఆంక్షలు విధించినా.. వైఎస్ జగన్ పర్యటన ఆగదన్నారు. పార్టీ శ్రేణులు, నాయకులు, యువకులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జిల్లాలో నలుగురు ఎస్ఐలకు స్థాన చలనం

నరసరావుపేట రూరల్: పల్నాడు జిల్లాలో నలుగురు ఎస్ఐలను వివిధ స్టేషన్‌లకు తాత్కాలికంగా ఎటాచ్ చేస్తూ జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు డీసీబీలో పనిచేస్తున్న టి.తిరుపతిరావును మాచవరం పీఎస్‌కు, మాచవరం పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న ఎం.రోశయ్యను సీసీఎస్‌కు, నరసరావుపేట రూరల్ పోలీసుస్టేషన్‌లో పనిచేసే డి.అశోక్‌ను నాగార్జునసాగర్ పోలీసుస్టేషన్‌కు గురజాల పోలీసుస్టేషన్‌లో పనిచేసే వై.వినోద్‌కుమార్‌ను మాచర్ల రూరల్ పోలీసుస్టేషన్‌కు ఎటాచ్ చేశారు.

వీఆర్‌కు మాచర్ల రూరల్ ఎస్ఐ నరసింహులు



మాచర్ల రూరల్: మాచర్ల రూరల్ ఎస్ఐ వి.నరసింహులును వీఆర్‌కు బదిలీ చేశారు. 45 రోజుల క్రితం మాచర్ల రూరల్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించిన కొద్దిరోజులకే రేంజ్ వీఆర్‌కు బదిలీ కావడం విశేషం. నరసింహులు ఇటీవల యాక్సిడెంట్ కేసులో ఎఫ్ఐఆర్ కాపీ ఇచ్చే విషయంలో మాజీ మంత్రి, కుటుంబ సభ్యులను లంచం అడిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు నరసింహులును వీఆర్‌కు బదిలీ చేశారు. ఏఎస్ఐగా పనిచేస్తున్న షేక్ రఫీకి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

బైక్‌పై విన్యాసాలు చేసిన వ్యక్తిపై కేసు

కృష్ణలంక(విజయవాడ తూర్పు): కృష్ణలంక జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంతో ఓ యువకుడు ప్రమాదకర విన్యాసాలు చేసి ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేసిన ఘటనపై కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. గుంటూరు జిల్లా పెనుమాక గ్రామానికి చెందిన మోహన్‌ప్రసాద్, ఉయ్యాల సురేష్ స్నేహితులు. మోహన్‌ప్రసాద్ కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పోరంకిలోని ఓ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అతని బైక్‌ను కొన్ని రోజుల క్రితం సురేష్ తీసుకెళ్లి వెనుక మరో యువకుడిని ఎక్కించుకుని అర్ధరాత్రి కృష్ణలంక జాతీయ రహదారిపై విన్యాసాలు చేశాడు. వాహనదారులను భయభ్రాంతులకు గురిచేశాడు. వాటిని ఎవరో ప్రయాణికులు వీడియో తీసి ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశారు. ఆ విన్యాసాలను ఇన్‌స్టాగామ్‌లో ఈ నెల 15న మోహన్‌ప్రసాద్ చూశాడు. తన బైక్‌తోనే విన్యాసాలు చేశాడని గుర్తించాడు. గంటలో తీసుకొస్తానని చెప్పి తన బైక్‌ను తీసుకెళ్లి అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడిపాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని మోహన్‌ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు మంగళవారం తెలిపారు.

క్రూరంగా హింసించిన పోలీసులను సస్పెండ్ చేయాలి

- వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేబిరాణి
- తంగెడలో హరికృష్ణకు పరామర్శ



ఉప్పుతల హరికృష్ణను పరామర్శించిన బేబిరాణి

దాచేపల్లి: వైఎస్సార్ సీపీ నేత ఉప్పుతల యల్లయ్య కుమారుడు హరికృష్ణని తీవ్రంగా కొట్టి గాయపరచిన దాచేపల్లి సీఐ భాస్కర్, ఎస్ఐలు, కానిస్టేబుళ్లను వెంటనే విధుల నుంచి సస్పెండ్ చేయాలని హైకోర్టు న్యాయవాది, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల బేబిరాణి డిమాండ్ చేశారు. ఇటీవల హరికృష్ణపై పోలీసులు కేసు నమోదు చేసి అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలకు గురి చేసిన విషయం పాఠక విదితమే. తీవ్ర అనారోగ్యం బారిన పడి ఇటీవల కాలికి శస్త్ర చికిత్స జరిగిన హరికృష్ణను మండలంలోని తంగెడలో మంగళవారం వేముల బేబిరాణి పరామర్శించారు. పోలీసుల పెట్టిన చిత్రహింసల గురించి హరికృష్ణ ఆమెకు వివరించారు. పోలీసులపై న్యాయపోరాటం చేసి తగిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని, వైఎస్సార్ సీపీ పూర్తి అండగా ఉంటుందని బేబిరాణి భరోసా ఇచ్చారు. దీనిపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తీవ్రంగా స్పందించి బాధితుడికి అండగా నిలిచారని, జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో కూడా ఫిర్యాదు చేశారని ఆమె గుర్తు చేశారు. దాచేపల్లి పోలీసులు వ్యవహరిస్తున్న తీరు వివాదస్పదంగా ఉందని, రెడ్‌బుక్ పాలన అమలు చేసేందుకే పోలీసులు ఇక్కడ పని చేస్తున్నారని ఆమె ధ్వజమెత్తారు. ఆమెవెంట పార్టీ దాచేపల్లి మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభాని, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, ఎంపీపీ కందుల జాను, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, నాయకులు దేవళ్ల వీరాస్వామి, గొగిరెడ్డి వెంకటరెడ్డి, వట్టి రామచంద్రారెడ్డి, ఉప్పుతల యల్లయ్య, అరికట్ల మల్లారెడ్డి, కాసర్ల నరసింహారెడ్డి, దేవళ్ల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

అభ్యుదయ రైతు శేషారావును ఆదర్శంగా తీసుకోవాలి

ప్రకృతి వ్యవసాయ డీపీఎం అమల కుమారి



రైతు శేషారావు పొలంలో పంటలను పరిశీలిస్తున్న డీపీఎం

పెదకూరపాడు: అభ్యుదయ రైతు అవార్డు గ్రహీత దర్శి శేషారావును ఆదర్శంగా తీసుకోవాలని ప్రకృతి వ్యవసాయ డీపీఎం అమలకుమారి కోరారు. మంగళవారం శేషారావు పొలంలో పీఎండీఎస్ వేసిన పైరును ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 30 రకాల విత్తనాలు చల్లి 45 రోజుల తర్వాత భూమిలో కలయదున్నడం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. అంతేకాకుండా కార్బన్ శాతం పెరిగి, నేల ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. పొడి వాతావరణంలో అయినా పైరు పచ్చగా ఉంటుందన్నారు. మిరప పంట వేసేవారు ఇప్పుడైనా పీఎండీఎస్ చల్లుకోవచ్చన్నారు. పత్తి, ఇతర అపరాల పంటలు వేసేవారు ప్రధాన పంటతోపాటు సమాంతరంగా ఐదు ప్రధానమైన పంటలు విత్తుకోవాలన్నారు. తీగజాతి పైరు, గింజ జాతి పైరు, చెట్టు జాతి పైర్లను వేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అమూల్య, ఉదయలక్ష్మి, మహబూబీ, జ్యోత్స్న పాల్గొన్నారు.

విద్యార్థులను అప్రెంటిస్‌షిప్ దిశగా ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న డీవీఈవో పద్మ

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ వృత్తి విద్యాకోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులను వివిధ పరిశ్రమలు, ఆస్పత్రుల్లో అప్రెంటిస్‌షిప్ చేసేలా ప్రోత్సహించాలని జిల్లా వృత్తి విద్యాధికారి జె.పద్మ పేర్కొన్నారు. ప్రవేశాల పెంపుపై ప్రభుత్వ, ప్రైవేటు వృత్తి విద్యా జూనియర్ కళాశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్‌తో మంగళవారం సాంబశివపేటలోని ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలోసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ విద్యార్థులు అప్రెంటిస్‌షిప్ చేసే సమయంలో నెలకు రూ.7,500 అందజేస్తారని తెలిపారు. జిల్లాలోని పరిశ్రమలు, ఆస్పత్రుల్లో సర్వే నిర్వహించి, అప్రెంటిస్ షిప్ మేళాకు సంబంధించిన వివరాలు అందజేయాలని కళాశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్‌కు సూచించారు. వృత్తి విద్యాకోర్సులను మరింత నాణ్యమైన విధంగా తీర్చిదిద్ది, విద్యార్థులకు నైపుణ్యాలతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. పారిశ్రామిక సర్వేను విజయవంతం చేయడంలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల సమన్వయంతో జిల్లాస్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. జిల్లాస్థాయి కమిటీకి డీవీఈవో చైర్మన్‌గా, డాక్టర్ ఉదయ శంకర్ సలహాదారుగా వ్యవహరించనున్నారు. సమావేశంలో ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. ఆనందబాబు పాల్గొన్నారు.

అందుబాటులోకి రానున్న ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ ప్రయాణికుల సౌకర్యార్థం చర్లపల్లి–నరసాపూర్, చర్లపల్లి–జల్‌నా, తిరుపతి –జల్‌నా వయా గుంటూరు డివిజన్ వారంతపు ప్రత్యేక రైళ్లు అందుబాటులోకి రానున్నట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆ వివరాలు ఇవీ...

- నంబర్ 07233 చర్లపల్లి– నరసాపూర్ రైలు ప్రతి శనివారం రాత్రి 07.50 గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు నరసాపూర్ చేరకుంటుంది. జూలై 5వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 28వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది.
- నంబర్ 07234 నరసాపూర్ – చర్లపల్లి రైలు ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు నరసాపూర్ నుంచి బయలు దేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది జూలై 6వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 29వ తేదీ వరకు ఇది అందుబాటులో ఉంటుంది. ఈ రైలు నల్గొండ, మిరియాలగూడ, నడికుడి, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, బీమవరం టౌన్, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్‌ల మీదుగా రాకపోకలు సాగించనుంది.
- నంబరు 7609 జల్‌నా–తిరుపతి రైలు ప్రతి సోమవారం ఉదయం 7 గంటలకు జల్‌నా నుంచి బయలు దేరి మరుసటి రోజు ఉదయం 10.45 గంటలకు తిరుపతి చేరుకుంటుంది జూలై 7వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 30వ తేదీ వరకు అందుబాటులో ఉంది.
- నంబర్ 07610 తిరుపతి–జల్‌నా రైలు ప్రతి మంగళవారం మధ్యాహ్నం 3.15 గంటలకు తిరుపతి నుంచి బయలు దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 3.50 గంటలకు జల్‌నా చేరుకుంటుంది. జూలై 7వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయి. ఈ రైలు తెలుగు రాష్ట్రాల్లోని మారపల్లి, వికారాబాద్, లింగంపల్లి, చర్లపల్లి, నల్గొండ, మిరియాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, స్టేషన్‌ల మీదుగా రాకపోకలు సాగించనుంది.

క్వారీ గుంతలో పడి యువకుడు మృతి



నాగరాజు (ఫైల్)

గుంటూరు రూరల్: క్వారీ గుంతలో పడి వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. గుంటూరు జిల్లా పేరేచర్ల గ్రామానికి చెందిన కట్టెపోగు నాగరాజు (30) ఆటోడ్రైవర్. అతనికి భార్య రూపకోటేశ్వరి, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. మరో రెండు రోజుల్లో కోటేశ్వరి ప్రసవించనుందని వైద్యులు తెలిపారు. దీంతో నాగరాజు ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం బయటకు వెళుతున్నానని ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. సాయంత్రానికి కూడా ఇంటికి రాకపోవటంతో స్థానికులు అంతటా వెతికారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని తెల్లక్వారీ గుంత వద్ద నాగరాజు చెప్పులు, పక్కనే అతని ద్విచక్ర వాహనం కనిపించాయి. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. తొలుత మేడికొండూరు, నల్లపాడు పోలీసుల మధ్య సరిహద్దు వివాదం నడిచిన అనంతరం నల్లపాడు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎన్‌డీఆర్ఎఫ్, గజ ఈతగాళ్ల కోసం సోమవారం వేచి చూశారు. రాత్రి కావటంతో మంగళవారం ఉదయం నుంచి వెతుకులాట ప్రారంభించగా, నాగరాజు మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. నాగరాజు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ జారి పడ్డాడా? ఇక్కడ ఎక్కువగా ఉన్న కోతులు దాడి చేస్తే తప్పించుకునే క్రమంలో ప్రాణాలు కోల్పోయాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మృత్యుపాశాలుగా క్వారీ గుంతలు

అనుమతులు లేకున్నా అక్రమంగా మైనింగ్ క్వారీలను నిర్వహిస్తూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొందరు వ్యవహరిస్తున్నారు. ఎక్కువ లోతులో క్వారీలను తవ్వి వదిలేస్తున్నారు. ఈ గుంతల్లో నీరు నిలిచిపోతోంది. విషయం తెలియని కొందరు వ్యక్తులు ఇటువంటి ప్రమాదాలతో ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మైనింగ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్‌పై ఫిర్యాదు

- అసలు యజమానులు రావడంతో బయట పడిన వ్యవహారం
- అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో కొరిటెపాడు సబ్ రిజిస్ట్రార్ ఫిర్యాదు

లక్ష్మీపురం: నకిలీ దస్తావేజులతో, నకిలీ ధ్రువీకరణ పత్రాలతో సుమారు రూ.10 కోట్ల విలువ చేసే 2,200 గజాల స్థలాన్ని కొరిటెపాడు రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించిన విషయంపై రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని రవాణా శాఖ కార్యాలయ సమీపంలో ఉన్న 2,200 గజాల స్థలానికి హైదరాబాద్‌కు చెందిన చంద్రమౌళి, విశాఖకు చెందిన రామకోటేశ్వరరావు, మాదల శ్రీవల్లి, మహమ్మద్ పర్వేజ్, గింజుపల్లి వీరయ్య చౌదరి, వెంకటరెడ్డి అనే వారు కలిసి ఈ ఏడాది జనవరి 31వ తేదీన నకిలీ పత్రాలను తయారు చేశారు. నకిలీ పత్రాలతో కొరిటెపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసేందుకు రూ.70 లక్షల చలానాలను చెల్లించారు. స్థలాన్ని కొనుగోలు చేసిన వారు స్థలం వద్దకు వెళ్లి దానిని బాగు చేసే పనిని ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకున్న అసలు యజమానులు అయిన విజయకృష్ణ ఆగ్రోటెక్‌కు సంబంధించిన నిర్వాహకులు నిలదీయగా... ఈ స్థలాన్ని తాము కొనుగోలు చేసినట్లు చెప్పారు. వెంటనే యజమానులు కొరిటెపాడు సబ్ రిజిస్ట్రార్‌ను కలిశారు. నకిలీ పత్రాలతో భూమిని ఎలా రిజిస్ట్రేషన్ చేశారని నిలదీశారు. పత్రాలను పరిశీలించిన సబ్ రిజిస్ట్రార్ ఈ విషయాన్ని జిల్లా రిజిస్ట్రార్ శైలజ దృష్టికి తీసుకెళ్లారు. తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించారని గుర్తించారు. జిల్లా రిజిస్ట్రార్ ఆదేశాలతో సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు మంగళవారం అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ అక్రమాల వ్యవహారంలో ఓ డాక్యుమెంట్ రైటర్ కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. దీంతో పాటు నిందితులు రిజిస్ట్రేషన్ సమయంలో సమర్పించిన నకిలీ పత్రాలను ఎవరు తయారు చేశారనే విషయంపై జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య


తెనాలి రూరల్: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోకి కొలకలూరు గ్రామానికి చెందిన గమిడి రామారావు(58) అనారోగ్య కారణాలతో సోమవారం అర్ధరాత్రి దాటాక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం మంగళవారం వెలుగు చూడడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

వైద్య సిబ్బందికి బదిలీ కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు వైద్య సిబ్బందికి మంగళవారం గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) జూమ్ ద్వారా సాధారణ బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. పలువురు పారామెడికల్ సిబ్బందిని బదిలీ చేశారు. బుధవారం, గురువారం కూడా వైద్య సిబ్బంది బదిలీలు జరుగుతాయని ఆర్డీ డాక్టర్ కె.సుచిత్ర తెలిపారు.

యోగాంధ్రకు ఏఎన్‌యూలో ఏర్పాట్లు పూర్తి



ఏఎన్‌యూ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర వేడుకలను ఘనంగా నిర్వహించడానికి గుంటూరు జిల్లా ప్రభుత్వ యంత్రాంగం, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం తెలిపారు. వర్సిటీ క్రీడా ప్రాంగణంలో బుధవారం ఉదయం 6.30 గంటల నుంచి ఈ యోగా వేడుకలు జరుగుతాయన్నారు. వర్సిటీ కళాశాలలతోపాటు, అనుబంధ కళాశాలలకు చెందిన సుమారు 10 వేల మంది విద్యార్థులు, సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. ఈ వేడుకలను సమష్టిగా విజయవంతం చేద్దామని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కోన శశిధర్, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కొత్త మధుమూర్తి, యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జి.గణేష్ కుమార్, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, వర్సిటీ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలా మణి పాల్గొంటారని వెల్లడించారు.

కూటమి మెడి‘కిల్’

- నత్తనడకన పిడుగురాళ్ల మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు
- గత నాలుగు నెలలుగా పూర్తిగా నిలిచిన పనులు
- పనులు చేపట్టాలంటూ సెల్ఫీ వీడియోల ద్వారా స్థానికుల డిమాండ్

పిడుగురాళ్ల: పల్నాడు ప్రాంతానికి మణిహారం లాంటి ప్రభుత్వ వైద్యశాల, వైద్య కళాశాల నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో నత్తనడకన సాగుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.540 కోట్ల వ్యయంతో శరవేగంగా సాగిన మెడికల్ కాలేజీ పనులు 80శాతం వరకు పూర్తయ్యాయి. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం భవన నిర్మాణాలను అటకెక్కించింది. దీనిపై ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంపై సెల్ఫీ వీడియోలు తీస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నారు.

80 శాతం వరకు పూర్తిచేసిన గత ప్రభుత్వం

వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో పేద ప్రజలకు ఉచిత, కార్పొరేట్ తరహా వైద్యం అందాలనే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిడుగురాళ్ల పట్టణ సమీపంలోని కామేపల్లి వద్ద 2019లో 50 ఎకరాల్లో మెడికల్ కళాశాల నిర్మాణం ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. సుమారు 80 శాతం వరకు ప్రభుత్వ వైద్యశాల, కళాశాలతో పాటు నర్సింగ్ కాలేజీ భవనాలు, హాస్టల్ భవనాలు నిర్మాణం పూర్తిచేసుకున్నాయి. వైద్యశాల మొదటి బ్లాకు నిర్మాణం పూర్తయింది. మిగిలిన ఐదు బ్లాకులు కూడా నిర్మాణ పనులలో ఉన్నాయి. ఈ ఐదు బ్లాకులు పూర్తయితే వెంటనే వైద్యసేవలు ప్రారంభమవుతాయి. ఈ ప్రాంతం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెడికల్ కళాశాల, వైద్యశాల నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో ఆగిపోయాయి. దీంతో ఈ ప్రాంతవాసులు మెరుగైన వైద్యసేవలకు గుంటూరు, విజయవాడ లాంటి దూరప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

సెల్ఫీ వీడియోల హల్‌చల్

కూటమి ప్రభుత్వ నిర్వాకాలను ఎండగట్టేందుకు ఇటీవల వైఎస్సార్ సీపీ గురజాల సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మెడికల్ కళాశాల వద్దకు వచ్చి, కూటమి నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే నిర్మాణం మొదలుపెట్టకపోతే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. దీంతో వైఎస్సార్ సీపీ నేతలతో పాటు ఈ ప్రాంత యువత కూడా మెడికల్ కళాశాల వద్దకు వచ్చి సెల్ఫీ వీడియోలతో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నారు. తమ ప్రాంతంలో పేద ప్రజలకు ఆణిముత్యం లాంటి మెడికల్ కళాశాలను వెంటనే ప్రభుత్వం పునఃప్రారంభించాలని పేదలకు మెరుగైన ఉచిత వైద్యం అందించాలని నినదిస్తున్నారు.



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పూర్తయిన ప్రభుత్వ వైద్యశాల బ్లాక్



మధ్యలోనే నిలిచిపోయిన మెడికల్ కళాశాల భవన నిర్మాణం



ఆగిపోయిన హాస్టల్ భవన నిర్మాణాలు

వైద్యశాల నిర్మాణ పనులు చేపట్టాలి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ వైద్యశాల నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు నిలిపివేయటం సరికాదు. పేద ప్రజలకు వైద్యం అందించేందుకు వైద్యశాల, వైద్య కళాశాలలను ప్రభుత్వం త్వరగా నిర్మించాలి.

– చింతా సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ పిడుగురాళ్ల మండల కన్వీనర్

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..



ఈ ప్రాంతంలో ఏదైనా ప్రమాదం జరిగితే నేరుగా గుంటూరు వెళ్లాల్సి వస్తుంది. 70 కిలోమీటర్లు దూరం వెళ్లేలోపు ప్రాణాలు కోల్పోవాల్సిన దుస్థితి. అందుకే ఈ ప్రాంతంలో వైద్యశాల నిర్మాణం త్వరగా పూర్తిచేస్తే వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్మాణం పూర్తిగా ఆగిపోయింది. తక్షణమే ప్రభుత్వ వైద్యశాల, కళాశాల నిర్మాణ పనులు చేపట్టాలి.

– మంద సుధీర్, వైఎస్సార్ సీపీ పిడుగురాళ్ల పట్టణ యూత్ కన్వీనర్

దారుణ పాశాలు!

అప్పుల బాధతో ఇరువురు రైతుల బలవన్మరణం

- తూబాడు, నాదెండ్ల గ్రామాల్లో విషాదం
- ప్రభుత్వ మద్దతు ధర లేక, సాగు నష్టాలు అధికమై అప్పులపాలైన వైనం
- పురుగుమందు తాగి తనువు చాలించిన రైతులు

నాదెండ్ల: ఆరుగాలం కష్టించి, ఎన్నో వ్యయప్రయాసలకోర్చి పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో తీవ్రంగా నష్టపోయిన ఇరువురు రైతులు బలవన్మరణానికి పాల్పడిన విషాదకర సంఘటనలు పల్నాడు జిల్లా నాదెండ్ల మండలంలో జరిగాయి. తూబాడు గ్రామానికి చెందిన సిరిబోయిన గోపాలరావు (43), నాదెండ్ల గ్రామం రామాపురానికి చెందిన నాస్యం ఆదినారాయణ (45) పురుగుమందు తాగి ప్రాణాలు విడిచారు. ఇరువురు రైతుల మరణంతో తూబాడు, నాదెండ్ల గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

- తూబాడు గ్రామానికి చెందిన సిరిబోయిన గోపాలరావు (43) వ్యవసాయ పనులు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన సొంత పొలం 30 సెంట్లు ఉంది. ఏటా కొంత భూమి కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. చీడపీడల కారణంగా మిర్చి దిగుబడి రాక నష్టపోయాడు. పొగాకు సాగులో దిగుబడి బాగున్నా ధరలు పతనమవటం, కొనేనాథుడు లేకపోవటంతో ఇంటి సమీపంలోనే పొగాకు నిల్వచేసి పట్టలు కప్పి భద్రపరిచాడు. సాగులో సుమారు రూ.20–25 లక్షల వరకు నష్టాలపాలయ్యాడు. ధర లేకపోవడం, రుణదాతల నుంచి ఒత్తిళ్లు రావడంతో మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు.
- మండల కేంద్రమైన నాదెండ్ల రామాపురం కాలనీకి చెందిన నాస్యం ఆదినారాయణ (45) ఒకటిన్నర ఎకరం సొంతభూమితో పాటూ 70 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తుంటాడు. పెరిగిన సాగు ఖర్చులు, తగ్గిన దిగుబడులు, ధరల పతనంతో తీవ్రంగా నష్టపోయాడు. సుమారు రూ.50–60 లక్షల వరకు అప్పులున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పుల బాధతో నిత్యం మధనపడేవాడు. కుటుంబ సభ్యులతో చెప్పుకుని కుంగిపోయేవాడు. సోమవారం రాత్రి 10 గంటలు దాటాక ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లి, పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు.

రైతు కుటుంబాలకు కలెక్టర్ పరామర్శ

నాదెండ్ల: రుణభారంతో ఆత్మహత్య చేసుకున్న ఇరువురు రైతుల కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు చెప్పారు. నాదెండ్లకు చెందిన నాస్యం ఆదినారాయణ, తూబాడు గ్రామానికి చెందిన సిరిబోయిన గోపాలరావు కుటుంబాలను మంగళవారం ఆయన పరామర్శించారు. మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. ఇరువురు రైతుల ఆత్మహత్యకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇరు కుటుంబాల ఆర్థిక పరిస్థితిని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక అధికారులకు పలు సూచనలు చేసి పూర్తిస్థాయి నివేదికలను అందించాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ చీఫ్ కమిషనర్ ఢిల్లీరావు, జిల్లా వ్యవసాయాధికారి మురళి, ఆర్డీఓ మధులత, నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, తహసీల్దార్ ఏవీ రమణ, ఏఓ శ్రీలక్ష్మి, ఎంపీపీ తలతోటి రాణి, తూబాడు ఉపసర్పంచ్ మద్దూరి కోటిరెడ్డి పాల్గొన్నారు.

ఇవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే ..

- మాజీ మంత్రి విడదల రజిని
- ప్రభుత్వం తక్షణం నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్

చిలకలూరిపేట: పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక, పంటలు అమ్ముకోలేని దుస్థితిలో ఇరువురు రైతులు ఆత్మహత్యకు పాల్పడటం ఎంతో బాధాకరమని మాజీ మంత్రి విడదల రజిని ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధరలేక, అప్పుల బాధ తాళలేక పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన పల్నాడు జిల్లా నాదెండ్ల మండలానికి చెందిన రైతులు నాశ్యం ఆదినారాయణ(45), శిరిబోయిన గోపాలరావు(43)ల మృతదేహాలు చిలకలూరిపేట ఏరియా ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తీసుకురాగా మాజీ మంత్రి మృతదేహాలకు నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ఇద్దరు రైతుల మరణాలు ప్రభుత్వ హత్యలేనని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ ఒక్క పంటకు గిట్టుబాటు ధర కల్పించటంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతి చెందిన రైతు కుటుంబాలకు ప్రభుత్వం తక్షణం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.



మృతదేహాలను సందర్శించి అనంతరం మాట్లాడుతున్న మాజీ మంత్రి రజిని

పెనుగంచిప్రోలు ఆలయ ఉద్యోగులకు మెమోలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసిన శ్రీతిరుపతమ్మవారి ఆలయం విధులు నిర్వర్తిస్తున్న 27 మందికి పైగా ఉద్యోగులు, అర్చకులు, పురోహితులకు ఈఓ కిషోర్‌కుమార్ మంగళవారం మెమోలు జారీ చేశారు. ఈ నెల 13న ఉద్యోగుల రహస్య భేటీ అని వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం జరిగిందని, 14వ తేదీన ఆలయ ప్రాంగణంలో ఈఓ అనుమతి లేకుండా బాధ్యత కలిగిన ఉద్యోగులు సమావేశం నిర్వహించినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయినందున మెమోలు జారీ చేసినట్లుగా ఈఓ పేర్కొన్నారు. మెమో అందిన ఏడు రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని, లేకుంటే చర్యలు తప్పవని స్పష్టచేశారు. అయితే దీనికి సంబంధించి ఉద్యోగులు అయోమయంలో ఉన్నారు. నూతన కార్యవర్గ ఏర్పాటుకు సంబంధించి సమావేశం నిర్వహించామని ఉద్యోగులు పేర్కొంటున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒకేసారి ఆలయ అర్చకులు, పురోహితులు, ఉద్యోగులకు మెమోలు జారీ చేయడం చర్చనీయాంశమైంది. ఈఓ, ఉద్యోగులు, అర్చకులు, పురోహితుల మధ్య గతంలో ఎన్నడూ ఇంత వ్యతిరేకత లేదని గ్రామస్తులతో పాటు భక్తులు పేర్కొంటున్నారు. ఆషాఢ మాసంలో అమ్మవారికి సారె సమర్పించటంతో పాటు శాకంబరీ ఉత్సవాలు జరగనున్న ఉన్న తరుణంలో ఆలయంలో నెలకొన్న సంక్షోభంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తక్షణం ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు ఈ విషయంలో స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

బెల్లంకొండ ఏవోగా అరుణకుమారి



బెల్లంకొండ: మండల వ్యవసాయ అధికారిగా కె.అరుణకుమారి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఏవోగా విధులు నిర్వహించిన డి.కృష్ణయ్య బదిలీపై పెదకూరపాడు మండలానికి వెళ్లారు. ప్రతిపాడు మండలంలో ఏవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న అరుణ కుమారి బదిలీపై బెల్లంకొండ మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం పొందేందుకు రైతులు రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలని కోరారు. వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం అందించే ప్రతి లబ్ధిని రైతులకు అందేలా చూస్తానని అన్నారు.

నిరుపేద విద్యార్థికి స్నేహహస్తాలు సహకారం



అచ్చంపేట: మండలంలోని తాళ్లచెరువు గ్రామానికి చెందిన మేదర భానుప్రసన్న అనే నిరుపేద విద్యార్థి హాస్టల్ ఖర్చుల నిమిత్తం స్నేహహస్తాలు ఫౌండేషన్ గౌరవ ప్రతినిధి మామిళ్లపల్లి విజయలక్ష్మి చేతులమీదుగా రూ.25 వేల చెక్కును సంఘ సభ్యులు మంగళవారం అందజేశారు. భానుప్రసన్న ఆంధ్రా యూనివర్సిటీలో ఎం.కాం రెండవ సంవత్సరం చదువుతుంది. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి, నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు స్నేహ హస్తాలు ఫౌండేషన్ కృషి అభినందనీయమన్నారు. స్నేహహస్తాలు ప్రతినిధి తాయి కరిముల్లాబాబు మాట్లాడుతూ ప్రతిభ గల భానుప్రసన్న ఆర్థిక ఇబ్బందులతో చదువు ఆపకూడదన్న కారణంగా గత ఏడాది కూడా హాస్టల్ ఖర్చుల నిమిత్తం రూ.25000 ఇచ్చామన్నారు. భానుప్రసన్న ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్నేహహస్తాలు సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ అనుమానాస్పద మృతి

గుడ్లవల్లేరు: మండలంలోని కౌతవరం శివారు పసుభొట్లపాలెంలో ట్రాక్టర్ డ్రైవర్ రేమల్లి వెంకట్రావు(45) అలియాస్ ముసలోడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. శత్రువుల చేతి లో వెంకట్రావు హత్యకు గురయ్యాడని బంధువులు ఆరోపిస్తున్నారు. మంగళవారం గ్రామంలోని రోడ్డు పక్కన గాయాలతో వెంకట్రావు విగతజీవిగా పడి ఉండడాన్ని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న గుడ్లవల్లేరు పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం ఆధారాలు చేపట్టే పనిలో ఉండగా, గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ పరిస్థితిని పర్యవేక్షించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సోమేశ్వరరావు, ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. మృతు డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి బంధువులను వైఎస్సార్ సీపీ నాయకులు మండలి హనుమంతరావు, నాగు, రాజు, ప్రసాద్ పరామర్శించారు.

తెలంగాణ ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కత్తితో దాడి

కృష్ణలంక(విజయవాడతూర్పు): తెలంగాణ ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ఓ వ్యక్తి కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రం భూపాలపల్లి జిల్లా, పరకాల డిపో నుంచి గుంటూరుకు సోమ వారం సాయంత్రం ఓ బస్సు బయలుదేరింది. బస్సు డ్రైవర్ సూర శ్రీనివాస్‌తోపాటు కో డ్రైవర్ ప్రకాష్ కూడా బస్సులో ఉన్నారు. మంగళవారం తెల్లవారుజాము 2.30 గంటలకు బస్సు విజయవాడ బస్టాండ్‌కు చేరుకుంది. అక్కడ ప్రకాష్ డ్రైవర్ సీట్‌లోకి వెళ్లగా శ్రీనివాస్ బయటకు వచ్చాడు. బస్టాండ్‌లో ప్రయాణికుడు బాషా ఆ బస్సు ఎక్కి డ్రైవర్ విశ్రాంతి తీసుకునే సీట్‌లో కూర్చున్నాడు. శ్రీనివాస్ అతడిని గమనించి తాను విశ్రాంతి తీసుకోవాలని, వేరే సీటులోకి వెళ్లాలని సూచించాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. బస్సు బస్టాండ్ నుంచి బయలుదేరి వారధి వద్దకు చేరుకోగానే శ్రీనివాస్ నిద్రపోయాడు. డ్రైవర్ శ్రీనివాస్ నిద్రించడాన్ని గుర్తించిన బాషా అతనిపై కత్తితో దాడి చేసి గాయపరిచాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరు కుని బాషాను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ శ్రీనివాస్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దుర్గమ్మ సేవలో జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మంజుందార్ మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన అర్చన మంజుందార్‌కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ తదితరులు పాల్గొన్నారు.

సముద్రాన్ని మింగేసిన పచ్చనేత

- ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ సీ మౌత్ కాలువను పూడ్చిన పచ్చనేత
- తద్వారా 10 ఎకరాల తీరం భూమి ఆక్రమణ
- ఎకరం రూ.5 కోట్లు చొప్పున మొత్తం భూమి విలువ రూ.50 కోట్లు
- ముడుపులు పుచ్చుకొని కొంత భూమికి పట్టాలిచ్చిన అధికారులు
- మిగిలిన ఆక్రమణకు డీకేటీలు సిద్ధం
- స్ట్రయిట్ కట్ పూడ్చడంతో కాలువలోనే 2 వేల పడవలు
- నిషేధం ముగిసి రెండు రోజులు దాటినా వేటకు వెళ్లలేని మత్స్యకారులు
- పనులను అడ్డుకున్న 9 గ్రామాల మత్స్యకారులు
- న్యాయం చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామంటున్న మత్స్యకారులు



ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్‌ను కుదించి నేరుగా సముద్రంలో కలిపిన కబ్జాదారులు



కాలువ పూడ్చడంతో ఈపూరు పాలెం స్ట్రయిట్ కట్‌లో నిలిచిన మత్స్యకారుల బోట్లు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: బాపట్ల మండలం దానవాయిపేట వద్ద సముద్రంలో కలుస్తున్న ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్‌ను సీ మౌత్ వద్ద పచ్చనేత, రియల్టర్ బుర్ల వెంకటరావు, (ఈయన టీడీపీ రైతువిభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పమిడి భాస్కరరావుకు స్వయాన వియ్యంకుడు) గుంటూరుకు చెందిన మరో రియల్ ఎస్టేట్ కంపెనీ కలిసి ఆక్రమించారు. ఏకంగా సముద్రంలోకి కర్వు(వంపుగా) తిరిగే ఈ ప్రధాన కాలువ మొత్తాన్ని పూడ్చివేశారు. కాలువ తిరిగి అటువైపునకు రాకుండా పెద్ద పెద్ద కొండరాళ్లను తెచ్చి అడ్డుగా కట్టకట్టారు. కిలోమీటరు పొడవున ప్రవహించే కాలువను చిన్నపిల్ల కాలువగా సముద్రంలోకి వెళ్లేలా స్ట్రయిట్‌గా తరలించారు. పాతకాలువను కిలోమీటరు మేర మొత్తం పూడ్చివేసి దాదాపు 10 ఎకరాల విస్తీర్ణం మొత్తాన్ని ఆక్రమించి చదును చేశారు. ఇక్కడ వెంచర్ వేసి అమ్మకం పెట్టడంతోపాటు రిసార్ట్‌లు నిర్మించేందుకు పనులు వేగవంతం చేశారు. రియల్టర్ బుర్ల వెంకటరావు ఆ స్థలంలో ఏకంగా గెస్ట్‌హౌస్ నిర్మించుకున్నారు. ఈ ప్రాంతంలో ఎకరం విలువ సగటున రూ.5 కోట్లు ఉంటుంది. ఈ లెక్కన ఆక్రమణ భూమి విలువ రూ.50 కోట్లు ఉంటుందని అంచనా. కబ్జా చేసిన మొత్తం 10 ఎకరాలలో ఇప్పటికే 3.42 ఎకరాలు, 1.50 ఎకరాలు చొప్పున రెండు భాగాలుగా డీకేటీ పట్టాలు కూడా పొందినట్లు సమాచారం. మిగిలిన ఆక్రమణ భూమికి కూడా డీకేటీలు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇందు కోసం బాపట్ల రెవెన్యూ అధికారులకు రూ. కోట్లలోనే ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులకు సైతం పెద్ద ఎత్తున ముట్టజెప్పినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

బోట్లకు తీవ్ర నష్టం

ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్(ప్రధాన కాలువ) సీ మౌత్ సముద్రానికి దాదాపు కిలోమీటరు దూరం నుంచి ఎడమ వైపుకు వంపుగా తిరిగి సముద్రంలో కలుస్తుంది.

దీనివల్ల సముద్రం నుంచి వచ్చే పోటు వల్ల కాలువలో నిలుపుకునే సుమారు 2 వేల బోట్లకు ఎటువంటి ప్రమాదం ఉండదు. అదే స్ట్రయిట్‌గా సముద్రంలోకి కాలువ వెళితే పోటు సమయంలో అలల ఉధృతికి బోట్లు ఒకదానికొకటి కొట్టుకొని పగిలి పోతాయి. దీనివల్ల తీవ్రం నష్టం కలుగుతుందని మత్స్యకారులు వాపోయారు. తమ జీవనభృతినే దెబ్బతీసే ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని కరాఖండిగా చెపుతున్నారు. ఆక్రమణదారులతో అధికారులు చేతులు కలిపి తమకు అన్యాయం చేయడానికి ప్రయత్నిస్తే ఎంతవరకైనా వెళతామని మత్స్యకారులు హెచ్చరించారు.

పనులు అడ్డుకున్న మత్స్యకారులు

కబ్జాచేసిన స్థలాన్ని మంగళవారం భారీ యంత్రాలతో చదును చేసే ప్రయత్నం చేయగా విషయం తెలుసుకున్న అడవిపల్లెపాలెం, దానవాయిపేట, కృపానగరం, విజయలక్ష్మీపురం, గాదె వెంకటరెడ్డి కాలనీ, ఓడరేవు తదితర గ్రామాల పరిధిలో 12 వేల కుటుంబాల నుంచి 2 వేల బోట్లకు చెందిన వందలాదిమంది మత్స్యకారులు సీమౌత్ వద్దకు చేరుకుని యంత్రాలతో చేపట్టిన పనులను అడ్డుకున్నారు. గంటల తరబడి మండుటెండలో ఆందోళనకు దిగారు. మత్స్యకారులు బోట్లను ఈపూరు పాలెం స్ట్రయిట్‌కట్‌లో లంగరు వేసి పెట్టుకొని సముద్రంలోకి వెళ్లి వేట సాగిస్తారు. రాకపోకలకు ఈ ప్రధాన కాలువ ఆధారం. రెండు నెలలుగా వేట నిషేధం కావడంతో ఇదే అదనుగా రియల్టర్లు స్ట్రయిట్ కట్‌ను పూర్తిగా ఆక్రమించి పూడ్చి వేశారు. దీంతో రెండు రోజుల క్రితం నిషేధం ఎత్తి వేసినా మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కలెక్టర్ ఆదేశాలతో అక్కడికి చేరుకున్న బాపట్ల ఆర్డీవో గ్లోరియా మత్స్యకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా అందుకు వారు ససేమిరా అన్నారు. దీంతో రెండు రోజుల్లో సమావేశం పెట్టి అందరితో మాట్లాడి పరిష్కారం చూపుతామని సర్ది చెప్పి అధికారులు పనులు నిలిపి వేయించారు.



తీరంలో పనులు అడ్డుకొని ఆందోళనకు దిగిన మత్స్య కారులు

రియల్టర్‌తో ఎమ్మెల్యే మంతనాలు

ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ ఆక్రమణ గొడవ విషయం తెలుసుకున్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ హుటాహుటిన వెళ్లి రియల్టర్ వెంకటరావును కలిసి ఆయన అతిథి గృహంలో మంతనాలు సాగించారు. ఎమ్మెల్యే తీరుపై మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తంచేశారు.



మత్స్య కారుల ఆందోళనను పట్టించుకోక రియల్టర్‌తో బాపట్ల ఎమ్మెల్యే వర్మ మంతనాలు

బుర్ల వెంకట్రావుపై చర్యలు తీసుకోవాలి

బాపట్లటౌన్: సముద్రపు అంచున బండరాళ్లతో అడ్డుకట్ట వేస్తున్న బుర్ల వెంకట్రావుపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన మంతెన కరుణరాజు మంగళవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. బాధితుడి కథనం మేరకు.. బాపట్ల మండలం పాండురంగాపురం పంచాయతీ పరిధిలోని అడవిపల్లిపాలెం సమీపంలో తనకు 13 ఎకరాల నాన్ అగ్రికల్చరల్ భూమి ఉందని, నా భూమికి పడమర వైపున చీరాల మండలం పిట్టువారిపాలెం గ్రామానికి చెందిన బుర్ల వెంకట్రావుకు పొలం ఉంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా వెంకట్రావు పెద్దపెద్ద కొండరాళ్లతో సముద్రపు నీరు బయటకు రాకుండా అడ్డుకట్ట వేస్తున్నారని, ఇదేమని అడిగినందుకు చంపుతానని బెదిరిస్తున్నారని అన్నారు. విచారించి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

ఏటీఎం మోడల్ సాగుతో నిరంతర ఆదాయం



ఏటీఎం పద్ధతిలో మొక్కలు నాటుతున్న ప్రకృతి వ్యవసాయదారులు

రాజుపాలెం: ప్రకృతి వ్యవసాయ విధానంలో ఏటీఎం మోడల్‌లో సాగు చేస్తే రైతులు 365 రోజులు నిరంతర ఆదాయం పొందవచ్చని పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం ఎస్ఎఫ్ఏ అప్పలరాజు తెలిపారు. మండలంలోని బలిజేపల్లి, కొత్తపాలెం గ్రామాలలో ప్రకృతి వ్యవసాయం రైతు గాలం జయసింహారావు పొలంలో ఏటీఎం మోడల్ విధానాన్ని మంగళవారం వేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విధానంలో ముందుగా భూమిని చదును చేసి నాలుగు అడుగుల వెడల్పు బెడ్‌లుగా ఒక అడుగు నీటి కాలువలుగా ఏర్పాటు చేసి ఆ బెడ్లపై 18 రకాల దుంప, తీగ ఆకుకూరలు, కూరగాయలు, బోర్డర్ క్రాఫ్‌గా మొక్కజొన్న వేయడం జరిగిందని తెలిపారు. ఏటీఎం మోడల్‌లో ఎటువంటి రసాయనాలు లేకుండా ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బలిజేపల్లి యూనిట్ ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి, ఐసీఆర్‌పీలు అంకమ్మరావు, యలమందమ్మ, తిరుపతమ్మ, నరసింహారావు, జ్యోతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించండి



పంచాయతీ అధికారి ఆదినారాయణకు వినతిపత్రం అందిస్తున్న మహిళలు

క్రోసూరు: మహిళా సంఘం ఆధ్వర్యంలో క్రోసూరులోని గ్రామ ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మండల అభివృద్ధి అధికారి, పంచాయితీ సిబ్బందికి మంగళవారం స్థానిక పలు కాలనీల మహిళలు మెమోరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని ఎనిమిదో వార్డుకు చెందిన కొత్తూరు బజారు నివాసితులు పంచాయతీ అధికారి ఆదినారాయణతో మాట్లాడుతూ తమ ప్రాంతంలోని బోరు బావులన్నీ ఎండిపోయాయని తెలిపారు. రోజు వారి నీటి అవసరాలకు చాలా ఇబ్బందిగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది ఆదినారాయణ ప్రతి రోజు నీటిని అందించే ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. మహిళా సంఘం క్రోసూరు మండల బాధ్యులు వి.అనూష మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకుండా ప్రజలను ఇబ్బంది పెట్టడం సరైంది కాదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకం ప్రకటించి ఆరు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ అమల్లోకి రాకపోవడం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో తిమ్మిసెట్టి హనుమంతరావు, షేక్ జాన్ బీ, షేక్ బుజ్జి, నిమ్మకాయల గాంధీ, షేక్ ఖాసింబి, షేక్ హుస్సేన్‌బీ, షేక్ సైదాబీ, ముజార్ అల్లాబీ, మొజార్ ధరియాబీ పాల్గొన్నారు.

భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చిన ఘనత మోదీదే



మాట్లాడుతున్న ఏపీ బీజేపీ ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకరరెడ్డి

అమరావతి: దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి అభివృద్ధి చెందుతున్న దేశంగా ఉన్న భారత్‌ను ప్రధాని నరేంద్రమోదీ తన 11 ఏళ్ల పాలనతో అభివృద్ధి చెందిన దేశంగా మార్చారని ఏపీ బీజేపీ ప్రధాన కార్యదర్శి, కోస్తాంధ్ర ఇన్‌చార్జి సన్నారెడ్డి దయాకరరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఏవీఆర్ కల్యాణ మండపంలో నిర్వహిం చిన పెదకూరపాడు నియోజకవర్గ బీజేపీ వికసిత్‌భారత్ సంకల్ప సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పల్నాడు జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆలోకం సుధాకరబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దయాకరరెడ్డి మాట్లాడుతూ 11 ఏళ్ల బీజేపీ పాలనలో పేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలు అమలు చేయటం జరిగిందన్నారు. అలాగే రైతులు, పేదల కోసం ప్రధాని గరీబ్ కల్యాణ్ అన్న యోజన, పీఎం ఆవాస్ యోజన, పీఎం స్వనిధి యోజన, అలాగే మహిళల కోసం పీఎం మాతృ వందన, ఆరోగ్యానికి ఆయుష్మాన్ భారత్ వంటి అనేక పథకాలు అమలు చేశారన్నారు. దేశ భద్రతకు పటిష్టమైన విదేశాంగ విధానంతో పాటు రక్షణ రంగంలో ఆయుధ సంపత్తిని సమకూర్చారన్నారు. ఇలా 11 సంవత్సరాలలో మోదీ భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలోనే నాలుగు స్థానానికి చేర్చారన్నారు. అన్ని రంగాలలో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రధాని మోదీ విధానాలను, బీజేపీ ఆశయాలను ఇంటింటికీ చేర్చాల్సిన బాధ్యత బీజేపీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షుడు శశికుమార్, రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మేకల హనుమంతరావు తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు ఇంటింటికీ అందించాల్సిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెదకూరపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

స్వగ్రామానికి చేరిన మత్స్యకారుల మృతదేహాలు

గుల్లలమోద(నాగాయలంక): కోనసీమ జిల్లా అంతర్వేది వద్ద సోమవారం ఉదయం జరిగిన చేపల బోటు ప్రమాదంలో దుర్మరణం పాలైన నాగిడి రాము (గుల్లలమోద), తమ్ముడు పోతురాజు(సంగమేశ్వర) మృతదేహాలు మంగళవారం వారి స్వగృహాలకు చేరుకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న పలువురు స్థానిక నాయకులు ఆయా గ్రామాలకు వెళ్లి మృతదేహాలను సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రమాదంలో ఎడమ కాలు విరిగిన బోట్ యజమాని నాగిడి వెంకటేశ్వరరావును కూడా పరామర్శించారు. ఏపీ సంప్రదాయ మత్స్యకారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

మహిళను చెట్టుకు కట్టేసిన వారిని కఠినంగా శిక్షించాలి

గార్లపాటి దాసు

క్రోసూరు : అప్పు చెల్లించాలంటూ మహిళను చెట్టుకు కట్టేసిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర హానరబుల్ చైర్మన్ గార్లపాటి దాసు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో నారాయణపురానికి చెందిన తిమ్మరాయప్ప, మునికన్నప్ప దగ్గర మూడేళ్ల క్రితం వడ్డీకి అప్పుగా తీసుకోగా అప్పుల భారం భరించలేక భార్యను కొడుకును వదిలేసి ఎటో వెళ్లిపోయాడని తెలిపారు. అప్పు చెల్లించాలంటూ భార్య శిరీషను లాక్కెళ్ళి తాడుతో చెట్టుకు కట్టేసి కొడుకు ముందు కొట్టడం స్త్రీలను అవమానించడమేనని అన్నారు. మహిళల మీద ఇలాంటి దాడులు జరగటం బాధాకరమని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వారిని కఠినంగా శిక్షించాలని, ఆ మహిళకు జరిగిన అవమానానికి బాధ్యత తీసుకొని ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని దాసు అన్నారు.

కట్నం వేధింపులకు వివాహిత బలి

కోనేరుసెంటర్(మచిలీపట్నం): కట్నం వేధింపులకు ఓ వివాహిత బలైంది. కట్నం డబ్బులతో పాటు ఇంటి అద్దె చెల్లించేందుకు పుట్టింటి నుంచి డబ్బులు తీసుకురావాలని భర్త ఆదేశించటంతో గత్యంతరం లేని యువతి ఆత్మహత్య చేసుకుంది. బందరు మండలం చినపోతేపల్లి గ్రామంలో జరిగిన ఈ ఘటనపై బందరు రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. చినపోతేపల్లికి చెందిన వడ్లమూడి లక్ష్మి (19), వలందపాలేనికి చెందిన కనుమూరి సతీష్ రెండేళ్లుగా ప్రేమించుకుని ఏడాది క్రితం వివాహం చేసుకున్నారు. పెళ్లయ్యాక కొంత కాలం వారి జీవితం సాఫీగా సాగింది. అనంతరం పుట్టింటి నుంచి కట్నం డబ్బులు తీసుకురావాలంటూ లక్ష్మిని సతీష్ వేధిస్తున్నాడు. దీంతో ఏడు నెలల క్రితం లక్ష్మి పుట్టింటికి వెళ్లిపోయింది. కొన్ని రోజుల క్రితం లక్ష్మి తల్లిదండ్రులు దిశా పోలీసులకు సతీష్‌పై ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరు పక్షాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇద్దరు కలిసి ఉండేందుకు ఇరు వర్గాల పెద్దలు అంగీకరించారు. మరి కొన్ని రోజుల్లో ఇద్దరు కలిసి జీవించాల్సి ఉండగా సతీష్ భార్యకు ఫోన్ చేసి గతంలో ఉన్న ఇంటికి ఐదు నెలల అద్దె చెల్లించాలని, కాపురానికి వచ్చేటప్పుడు ఆ డబ్బు తీసుకురావాలని స్పష్టంచేశారు. ఈ విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. తన తల్లిదండ్రుల వద్ద అంత డబ్బు లేదని చెప్పినా సతీష్ వినకపోవటంతో మనస్థాపానికి గురైన లక్ష్మి సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొంత సేపటికి లక్ష్మి ఆత్మహత్య చేసుకోవడాన్ని ఆమె సోదరులు గుర్తించారు. లక్ష్మిని కిందికి దింపి ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి సోదరుడు వడ్లమూడి వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి



మాట్లాడుతున్న ఏవో వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఏఈఓ నారాయణ

అచ్చంపేట: ఖరీఫ్‌కు ముందే వేసవి దుక్కులు దున్ని భూములను సిద్ధంగా ఉంచుకోవాలని, భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో పి.వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోనూరు, కస్తలలో మంగళవారం రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ఫలితాలను బట్టి ఎరువులు వాడాలని చెప్పారు. పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని, విక్రయ కేంద్రాల నుంచి తప్పనిసరిగా బిల్లులు తీసుకుని పంట కాలం పూర్తయ్యేవరకు వాటిని భద్రపరచుకోవాలన్నారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): మండలంలోని లంకెలకూరపాడు, చాగంటివారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి బీవీ నారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం వరి, మిరప, పత్తి పంటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా పచ్చిరొట్ట పైరులు సాగు చేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రంలో భూయజమానుల అంగీకారంతో పంట సాగు హక్కు పత్రం పొందవచ్చన్నారు. అన్నదాత సుఖీభవ పథకంకు అర్హత కలిగిన రైతుల వివరాలు ప్రభుత్వం ఈ కేవైసీ ఆటో అప్‌డేట్ చేయటం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది శైలజ, సుభాని, రైతులు పాల్గొన్నారు.

గేదెల దొంగలు అరెస్టు

పెదకూరపాడు: వేసవి కాలం వస్తే చాలు గేదెలే లక్ష్యంగా కొందరు వ్యక్తులు చోరీలకు పాల్పడుతున్నారు. పెదకూరపాడు ప్రాంతంలో పాడి గేదెలే లక్ష్యంగా రాత్రి సమయంలో చోరీలకు తెగబడుతున్నారు. పెదకూరపాడు ఎస్ఐ గిరిబాబు వేసవి గేదెల దొంగలను మంగళవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు పెదకూరపాడు పోలీసు స్టేషన్‌లో గేదెలు కనిపించడం లేదని నాలుగు కేసులు నమోదు అయ్యాయన్నారు. ఈ క్రమంలో కొందరు అనుమానితులను విచారించగా వారి వద్ద నుంచి 7 గేదెలు, రూ.7 లక్షల నగదు రికవరీ చేసినట్లు తెలిపారు. పెదకూరపాడుకు చెందిన గుప్త గాంధర్, యర్రంశెట్టి భూపతిరావు, షేక్ గఫూర్‌లు ప్రతి ఏడాది వేసవి కాలంలో పాడిరైతులు పంట పొలాలకు గేదెలను వదిలి వెళ్లేవారు. ఇదే అదునుగా భావించిన వారు తెలంగాణ ఖమ్మం జిల్లా చింతకుర్తికి చెందిన గుడిపూడి రంగా అనే వ్యక్తితో పరిచయం ఏర్పరుచుకుని పెదకూరపాడు ప్రాంతంలో దొంగిలించిన గేదెలను ఖమ్మం జిల్లాలో అమ్ముతూ ఉండేవారు. ఈ క్రమంలో పెదకూరపాడుకు చెందిన గాంధర్‌ను విచారించగా ఈ గుట్టు రట్టు చేసినట్లు ఎస్ఐ గిరిబాబు తెలిపారు. వారిని సత్తెనపల్లి కోర్టులో హాజరుపరిచినట్లు ఆయన చెప్పారు.

చోరీ కేసుల్లో నలుగురు నిందితులు అరెస్టు



రికవరీ చేసిన సొత్తు, నిందితులతో డీఎస్పీ, సీఐ

గన్నవరం: వేర్వేరు చోరీ కేసుల్లో నలుగురు నిందితులను ఆత్కూరు పోలీసులు మంగళవారం అదుపు లోకి తీసుకుని ఐదు బైక్‌లు, విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుల వివరాలను డీఎస్పీ సీహెచ్. శ్రీనివాసరావు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. ఉంగుటూరు మండలం పొట్టిపాడులో మే నెల మూడో తేదీ తెల్లవారుజామున ఇంటిలో నిద్రిస్తున్న బాణాల సుభాషిణి మెడలోని ఐదు కాసుల బంగారు గొలుసును దొంగలు అపహరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి సీఐ కె.వి.ఎస్.ఎన్. సత్యనారాయణ నేతృత్వంలో ప్రత్యేక టీమ్ దర్యాప్తు చేపట్టింది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఈ చోరీకి పాల్పడింది జంగారెడ్డిగూడెం శివారు వేగవరం గ్రామానికి చెందిన పారేపల్లి శేషు, పోలవరపు నాగదుర్గాప్రసాద్, దుగ్గిరాల శివరామకృష్ణగా గుర్తించారు. ప్రధాన నిందితుడు శేషును మంగళ వారం అరెస్టుచేసి, అతని వద్ద బంగారు గొలుసు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన ఇద్దరు నిందితులు కొవ్వూరులో జరిగిన ఓ చోరీ కేసులో పట్టుబడి జైలులో రిమాండ్‌లో ఉన్నారు.

మరో ముగ్గురి అరెస్టు

ఇటీవల ఆత్కూరు, వీరవల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుసగా జరుగుతున్న బైక్ చోరీలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. దొంగల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టిన ఆత్కూరు పోలీసులు పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద బైక్‌పై వెళ్తున్న ఏలూరుకు చెందిన దత్తి నవీన్, భీమవరానికి చెందిన గుత్తుల రవికుమార్, సాయిశ్రీరామ్‌ను అనుమానితులుగా గుర్తించి అదుపులో తీసుకున్నారు. పోలీసుల విచారణలో వారు బైక్ చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. పెదపాడు, కైకలూరు ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లలో చొరబడి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు అపహరించినట్లుగా ఒప్పుకున్నారు. పోలీసులు వారి వద్ద నాలుగు బైక్‌లు, బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులు ఇప్పటికే పలు చోరీ కేసుల్లో జైలుకు వెళ్లొచ్చారు. ఈ కేసులను ఛేదించిన సీఐ సత్యనారాయణ, ఎస్ఐ సురేష్ చావా, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.